సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం, 13, డిసెంబర్, 2023



భక్తులకు ఇబ్బంది కలగొద్దు

తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనానికి వచ్చే సామాన్య భక్తులు ఇబ్బంది పడకుండా చూడా లని కలెక్టర్ ప్రియాంక ఆల సూచించారు. 10లో



నేడు డీసీసీబీ పాలకవర్గం భేటీ

డీసీసీబీ పాలకవర్గ సమావేశం బుధవారం ఉదయం ఖమ్మం గాంధీచౌక్‌లోని ప్రధాన కార్యాలయంలో జరగనుంది. 10లో


గరిష్టం / కనిష్టం 28° / 17°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. రాత్రి చలి ప్రభావం ఉంటుంది. తెల్లవారుజామున మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళ వారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోప వీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. మంగళ వారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

కొనసాగుతున్న నర్సింగ్ పరీక్షలు



పరీక్ష రాస్తున్న విద్యార్థినులు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫరీ (జీఎన్‌ఎం) పరీక్షలు కొనసాగుతున్నాయి. ఈనెల 4వ తేదీన ప్రారంభమైన పరీక్షలు చివరి దశకు చేరాయి. ఇప్పటికే మూడో సంవ త్సర విద్యార్థులకు పరీక్షలు పూర్తికాగా, 15వ తేదీన చివరి పరీక్ష జరగనుంది. అలాగే, 17వ తేదీ నుండి 21వ తేదీ వరకు విద్యార్థినులకు ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తారు. కాగా, ఉమ్మడి జిల్లాలోని ఐదు నర్సింగ్ కళాశాలలకు చెందిన 593 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరవుతున్నారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



నరేందర్ రెడ్డి

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న సూదిరెడ్డి నరేందర్ రెడ్డికి కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. 'రోల్ ఆఫ్ ఐఆర్‌డీఏఐ రెగ్యులేటింగ్ హెల్త్ ఇన్సూరెన్స్ ఇండియా ఏ స్టడీ' అనే అంశంపై యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌కు చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ డి.సక్రియా పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను నరేందర్‌రెడ్డికి ఈ పురస్కారం లభించింది. ఈ సందర్భంగా మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జాన్ మిల్టన్, వైస్ ప్రిన్సిపాల్ డి. భద్రయ్య, అధ్యాపకులు శ్యాం ప్రసాద్, కామేశ్వరరావు, శ్రీను, రమేష్ నరేందర్ రెడ్డిని ఘనంగా సత్కరించారు.

16న జిల్లా క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ పోటీలు

కొత్తగూడెంటౌన్: దమ్మపేట మండలం అంకంపాలెంలో ఈనెల 16వ తేదీన జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ(పరుగు పందెం) పోటీలు నిర్వహించనున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మహీధర్ తెలిపారు. 20, 18, 16 ఏళ్ల లోపు పురుషులు, మహిళలు, బాలబాలికలకు పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఇక్కడ ప్రతిభ కనబరిచే వారిని ఈనెల 23న కామారెడ్డిలో జరిగే రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు పీఈటీ రవికుమార్(88976 48486), కోచ్ నాగేందర్‌ను సంప్రదించాలని సూచించారు.

పీహెచ్‌సీలను సందర్శించిన రాష్ట్ర బృందం

వైరా/కామేపల్లి: రాష్ట్ర స్థాయి కుష్ఠు నిర్మూలన బృందం మంగళవారం వైరా, కామేపల్లి పీహెచ్ సీలను సందర్శించింది. ఈ సందర్భంగా సభ్యులు కుష్ఠు వ్యాధి లక్షణాలు, చికిత్స, నివారణపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ప్రాథమిక దశలోనే వ్యాధి లక్షణాలను గుర్తించి సకాలంలో చికిత్స అందిస్తే అంగవైకల్యం ఏర్పడకుండా బాధితులను కాపాడవచ్చని తెలిపారు. అనంతరం పీహెచ్‌సీల్లో రికార్డులు పరిశీలించారు. ఈ బృందంలో టి.సకలరెడ్డి, లోకేందర్, నరసింహారెడ్డి, లూర్దుమేరీ, అరుణ, జిల్లా కుష్ఠు నివారణాధికారి వీఎస్‌ఆర్‌కే.శాస్త్రి, పీఎంఓ భోజ్యానాయక్, వైద్యాధికారి ఉదయలక్ష్మితో పాటు కృష్ణ,చందన, శిరీష, దూప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

భద్రగిరిలో వైకుంఠ శోభ

నేడు ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాలు ప్రారంభం

- తొలిరోజు మత్స్యావతారంలో రామయ్య దర్శనం
- ఈనెల 23 వరకు నిత్యకల్యాణాలు నిలిపివేత



విద్యుత్ లైట్ల వెలుతురులో దేదీప్యమానంగా కనిపిస్తున్న భద్రాద్రి ఆలయం

భద్రాచలం: భద్రగిరిలో ముక్కోటి ఉత్సవ శోభ సంతరించుకుంది. శ్రీ సీతారామచంద్రస్వామి వారు కొలువై ఉన్న ఈ దివ్యక్షేత్రం ఉత్సవాలకు ముస్తాబైంది. రోజుకో అవతారంలో దర్శనభాగ్యం కల్పించే రామచంద్రమూర్తి కోసం ఎదురుచూస్తున్న భక్తుల నిరీక్షణకు ఇక తెరపడనుంది. సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్యను కొలువుదీర్చేందుకు మిథిలా స్టేడియంలో ప్రత్యేక వేదిక సిద్ధమైంది. రామనామ స్మరణలు, సంకీర్తనలతో శ్రీ రామ దివ్య క్షేత్రంలో ఆధ్యాత్మిక వాతావరణం చోటుచేసుకుంది. రామాలయంలో బుధవారం వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు ప్రారంభం కానున్నాయి. జనవరి 2 వరకు అధ్యయనోత్సవాలు, 3 నుంచి 5 వరకు విలాసోత్సవాలు జరగనున్నాయి. జనవరి 8న సర్వదేవతా అలంకారమైన విశ్వరూప సేవ నిర్వహించనున్నారు.

నేటి నుంచి అధ్యయనోత్సవాలు..

అధ్యయనోత్సవాల్లో భాగంగా బుధవారం నుంచి 22 వరకు పగల్ పత్తు ఉత్సవాలు, 23 నుంచి జనవరి 2 వరకు రాపత్తు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ క్రమంలో స్వామివారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు. బుధవారం మత్స్యావతారం, 14న కూర్మావతారం, 15న వరాహావతారం, 16న నరసింహావతారం, 17న వామనావతారం, 18న పరశురామావతారం, 19న శ్రీరామావతారం, 20న బలరామావతారం, 21న శ్రీకృష్ణావతారంలో స్వామివారిని అలంకరిస్తారు. 22న తెప్పోత్సవం, 23న ఉత్తర ద్వార దర్శనం వేడుకలు ఉంటాయి. ఇందుకోసం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి తెల్లవారుజామున ఉత్తరద్వారంలో వేంచేపు చేస్తారు. అక్కడ భక్తులు దర్శించుకున్న తర్వాత ద్వారానికి ఎదురుగా గల మిథిలా స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై కొలువుదీరుస్తారు. భక్తుల దర్శనాలు, ప్రత్యేక పూజల అనంతరం తిరువీధి సేవ నిర్వహించి తిరిగి గర్భగుడికి తీసుకొస్తారు. కాగా, పగల్‌పత్తు ఉత్సవాల్లో భాగంగా బుధవారం నుంచి ఈనెల 23 వరకు బేడా మండపంలో జరిగే నిత్యకల్యాణాలు రద్దు చేశారు.

నేటి సాంస్కృతిక కార్యక్రమాలిలా..

అధ్యయనోత్సవాల సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో మిథిలా స్టేడియం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు స్థానిక కళాకారులతో పాటు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, వరంగల్‌కు చెందిన కళాకారులచే కూచిపూడి, సంగీత, భజన కార్యక్రమాలు, రాత్రి 9.15 గంటల నుంచి 11 గంటల వరకు పర్సూరు నాగాంజనేయ నాట్యమండలి వారిచే 'శ్రీకృష్ణ రాయబారం' నాటక ప్రదర్శన ఉంటాయి.

ఉత్సవాలకు సర్వం సిద్ధం..

ముక్కోటి అధ్యయనోత్సవాలను పురస్కరించుకుని రామాలయాన్ని, భద్రాచలాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. బ్రిడ్జి సెంటర్, అభయాంజనేయస్వామి పార్క్, సూపర్‌బజార్ సెంటర్, మిథిలా స్టేడియం వద్ద ఇప్పటికే స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. రామాలయం, మిథిలా స్టేడియం పరిసర ప్రాంతాల్లో షామియానాలు, చలువ పందిళ్లు వేశారు. భక్తులకు ఆధ్యాత్మికంగా ఆహ్వానం పలికేందుకు రామాయణ ఇతివృత్తాలను తీర్చిదిద్దుతున్నారు. మిథిలా స్టేడియంలో స్వామివారి వేదికను ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలతో రామాలయం వెలుగొందుతోంది. పట్టణంలో పలుచోట్ల ఉత్సవాల బోర్డులు ఏర్పాటు చేశారు.



భద్రాచలంలో ఏర్పాటు చేసిన స్వాగతద్వారం

'గుర్తింపు'లో పొత్తుల్లేవ్ !

- సింగరేణిలో ఈనెల 27న గుర్తింపు సంఘం ఎన్నికలు
- అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి నడిచిన కామ్రేడ్లు, కాంగ్రెస్ శ్రేణులు
- ఇప్పుడు కార్మిక సంఘాలు మాత్రం ఎవరికి వారే పోటీ
- గెలుపే లక్ష్యంగా పని చేస్తున్న పార్టీలు



గత గుర్తింపు ఎన్నికల్లో ఓటు వేసేందుకు బారులు దీరిన కార్మికులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులతో అధికార బీఆర్‌ఎస్ పార్టీని మట్టి కరిపించిన రాజకీయ పార్టీలు సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల దగ్గరికి వచ్చే సరికి పొత్తుల మాట ఎత్తడం లేదు. ప్రధాన రాజకీయ పార్టీలన్నీ తమ అనుబంధ కార్మిక సంఘం గెలుపు కోసం వ్యూహాలు రచిస్తున్నాయి.

వాయిదాల పర్వం..

తెలంగాణలోని ఆరు జిల్లాల పరిధిలో సింగరేణి బొగ్గు గనులు విస్తరించి ఉన్నాయి. సుమారు 40వేల మంది కార్మికులు ఈ సంస్థలో పని చేస్తున్నారు. ఇప్పటివరకు బీఆర్‌ఎస్ అనుబంధ కార్మిక సంఘమైన తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) గుర్తింపు సంఘంగా ఉంది. ఆరు జిల్లాల పరిధిలో 11 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల గెలుపోటములను సింగరేణి కార్మికులు ప్రభావితం చేయగలరు. దీంతో సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించే విషయంలో అప్పటి అధికార బీఆర్‌ఎస్ ప్రభుత్వం మీనమేషాలు లెక్కించింది. 2021 అక్టోబర్ నుంచి 2023 అక్టోబర్ వరకు రెండేళ్ల పాటు వివిధ కారణాలతో వాయిదా వేస్తూ వచ్చింది. చివరకు నామినేషన్ల స్వీకరణ పూర్తయిన తర్వాత అసెంబ్లీ ఎన్నికలను సాకుగా చూపుతూ మరోసారి గుర్తింపు ఎన్నికలు వాయిదా వేశారు.

మారిన సమీకరణలు..

అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రధాన పార్టీల మధ్య రాజకీయ సమీకరణలు కూడా మారాయి. ఆ ఎన్నికలకు మూడు నెలల ముందువరకు బీఆర్‌ఎస్, సీపీఎం, సీపీఐ ఒక వైపు ఉండగా కాంగ్రెస్ పార్టీ మరోవైపు నిలబడింది. కానీ గత ఆగస్టులో చోటుచేసుకున్న పరిణామాల తర్వాత బీఆర్‌ఎస్ పార్టీ ఒక వైపు ఉండగా కాంగ్రెస్, సీపీఐ ఒక జట్టు కట్టాయి. కొంత సంక్లిష్ట పరిస్థితుల మధ్య సీపీఎం సైతం ఈ రెండు పార్టీలకు అండగానే నిలబడింది. పొత్తులు కుదిరి రెండు నెలలు కూడా పూర్తి కాకుండానే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మిత్ర పక్షాలు విజయ ఢంకా మోగించాయి. కలిసికట్టుగా విజయ యాత్రలు కొనసాగిస్తున్నాయి. మరోవైపు ఊహించని పరాజయం బీఆర్‌ఎస్ వశమైంది. దీంతో సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల విషయంలో ప్రధాన పార్టీల మధ్య మిత్రధర్మం కొనసాగుతుందా లేక కార్మిక సంఘాల విషయంలో జోక్యం చేసుకోకుండా మిన్నకుంటాయా అనే సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

టీబీజీకేఎస్ సత్తా చాటినా..

ఈనెల 27న జరగబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో 13 కార్మిక సంఘాలు పోటీలో ఉన్నాయి. ఈ మేరకు నామినేషన్లు దాఖలు చేశాయి. 2017లో జరిగిన ఎన్నికల్లో భూపాలపల్లి, మందమర్రి ఏరియాల్లో సీపీఐ అనుబంధ కార్మిక సంఘమైన ఏఐటీయూసీ విజయం సాధించగా, మిగిలిన తొమ్మిది ఏరియాల్లో టీబీజీకేఎస్ గెలుపొందింది. అయితే నాలుగేళ్ల పదవీ కాలం ముగిసినా వాయిదా పేరుతో మరో రెండేళ్లు గుర్తింపు సంఘంగా ఉండటంతో టీబీజీకేఎస్‌పై కార్మికుల్లో కొంత వ్యతిరేకత గూడు కట్టుకుంది. దీనికి తోడు ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి పాలయింది. దీంతో టీబీజీకేఎస్ శ్రేణుల్లో కొంత ఆందోళన నెలకొంది. దీన్ని పోగొట్టేందుకు ఆ సంఘానికి చెందిన నాయకులు ఏరియాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ సంఘానికి మద్దతుగా ఉన్న నేతలు, కార్మికుల్లో ధైర్యం నింపుతూ ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నారు.

ఎవరికి వారే పోటీ..?

తెలంగాణ సెంటిమెంట్ బలంగా ఉన్న కాలంలో సింగరేణిలో టీబీజీకేఎస్ ప్రభావం చూపింది. కానీ అంతకు ముందు సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ, కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీలకే సంస్థాగత బలం ఎక్కువ. ముఖ్యంగా ఇల్లెందు, కొత్తగూడెం, బెల్లంపల్లి, శ్రీరాంపూర్ ఏరియాల్లో ఏఐటీయూసీ ఇప్పటికీ బలంగానే ఉండగా, కార్పొరేట్, మణుగూరు ఏరియాల్లో ఐఎన్‌టీయూసీ సత్తా చాటుతోంది. దీంతో బలమున్న చోట పొత్తులు ఎందుకనే అభిప్రాయంతో ఇటు కాంగ్రెస్, అటు సీపీఐ ఉన్నాయి. అందువల్లే కాంగ్రెస్ మద్దతుతో కొత్తగూడెం సీటును గెలుచుకున్న సీపీఐ.. సింగరేణి ఎన్నికల్లో పొత్తు విషయంలో చొరవ చూపడం లేదు. కాంగ్రెస్ పార్టీ సైతం ఇదే ధోరణి కనబరుస్తోంది.

నా గెలుపు.. లక్షలాది మంది ఆకాంక్ష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాంబశివరావు, పక్కన వివిధ పార్టీల నాయకులు

విజయోత్సవ సభలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన లక్షలాది మంది ఉద్యమ పార్టీ తరఫున తాను గెలవాలని కోరుకున్నారని, వారి ఆకాంక్ష మేరకే విజయం సాధ్యమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఖమ్మంలో మంగళవారం కూనంనేని విజయోత్సవ ర్యాలీ నిర్వహించగా, శ్రీశ్రీ విగ్రహం నుంచి ప్రారంభమైన మోటారు సైకిల్ ర్యాలీ రోటరీనగర్, ఇల్లెందు క్రాస్‌రోడ్, జెడ్పీసెంటర్, మయూరిసెంటర్, కాల్వొడ్డు, ఎఫ్‌సీఐ బైపాస్ మీదుగా ఎంబీ గార్డెన్స్‌కు చేరుకుంది. ఈసందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ పదేళ్ల టీఆర్‌ఎస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు అంతం చేయాలని భావించారన్నారు. తద్వారా కమ్యూనిస్టు పార్టీ భావజాలం అధికంగా ఉన్న ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీకి ఏకపక్ష విజయం లభించిందన్నారు. కాంగ్రెస్, సీపీఐ పొందికతతో సానుకూల ఫలితాలు వచ్చాయని తెలిపారు. ఒకే స్థానం తీసుకుని పొత్తు కుదుర్చుకునే విషయంలో కొంత తటపటాయించినా, ఉద్యమ అభిమానులు చట్టసభల్లో కమ్యూనిస్టు గొంతుక కోసం ముందుకు సాగాలని సూచించారని చెప్పారు. సీపీఎం సైతం మెజార్టీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీని బలపరిచిందని, ఆ పార్టీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి ఈ విషయాన్ని బహిరంగానే వెల్లడించారని తెలిపారు. ఓట్లు తగ్గినా భావజాలం పదిలంగానే ఉందని, కమ్యూనిస్టుల శక్తిని మారిన ఎన్నికల రాజకీయాల్లో ఓట్లతో పోల్చవద్దని కూనంనేని సూచించారు. ప్రజాప్రతినిధిగా ఎప్పుడు తప్పు చేయనని, జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. కాగా, కూనంనేనికి సీపీఐ సీనియర్ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు, వివిధసంఘాలు, సంస్థలు, ప్రముఖులు సన్మానించారు. విజయోత్సవ సభలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నానాగేశ్వరరావుతో పాటు వివిధ పార్టీల నాయకులు రాయల నాగేశ్వరరావు, పొన్నం వెంకటేశ్వరరావు, కూరపాటి వెంకటేశ్వరరావు, బాగం హేమంతరావు, ఎస్.కే.సాబీర్‌పాషా, దండి సురేష్, మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఎస్.కే.జానీమియా, కొండపర్తి గోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరా చారి

పాల్వంచ : ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు పాల్వంచలోని కేటీపీఎస్ డీఏవీ పాఠశాలలో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన(సైన్స్ ఫేర్) నిర్వహించనున్నట్లు డీఈఓ వెంకటేశ్వరా చారి తెలిపారు. మంగళవారం ఆయన పాఠశాలలో విలేకరులతో మాట్లాడారు. వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థులు తమ ప్రాజెక్టులతో హాజరు కావాలని సూచించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, వైఖరులు, విజ్ఞాన శాస్త్రం పట్ల అభిరుచి, ఆసక్తి పెంచి భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రతి సంవత్సరం ఈ ప్రదర్శనలు నిర్వహిస్తున్నాయని వివరించారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన వారిని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తామని చెప్పారు. ఒక ఎగ్జిబిషన్‌కు ఒకరు లేదా ఇద్దరు విద్యార్థులు మాత్రమే పాల్గొనాలని కోరారు. ప్రతి పాఠశాల విద్యార్థులు 3 నుంచి 5 అంశాలపై తప్పకుండా ప్రదర్శనలకు రావాలని, గైడ్ టీచర్ ఒక్కరే ఉండాలని అన్నారు. ఐటీడీఏ పాఠశాలల ఎగ్జిబిట్స్‌కు ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థులతో పాటు గైడ్ టీచర్లకు ఉచిత భోజనం, రాత్రి బస, వసతి సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. అనంతరం సైన్స్‌ఫేర్ కమిటీల కన్వీనర్లు, సభ్యులతో సమీక్ష నిర్వహించారు. సభ్యులు ఒక రోజు ముందు వచ్చి ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో ప్రభుత్వ పరీక్షల సహ కమిషనర్ ఎస్.మాధవరావు, జిల్లా సైన్స్ అధికారి చలపతి రాజు, సంపత్ కుమార్, సాయికృష్ణ, ప్రకాశ్‌కుమార్, కిరణ్‌కుమార్, ఎంఈఓలు శ్రీరామ్మూర్తి, సత్యనారాయణ, లక్ష్మి, ప్రిన్సిపాల్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

16న బీఆర్‌ఎస్ సమావేశం

సూపర్‌బజార్(కొత్తగూడెం): బీఆర్‌ఎస్ జిల్లా స్థాయి సమావేశం ఈనెల 16న ఉదయం 10 గంటలకు కొత్తగూడెంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో జరగనుంది. జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు నేతృత్వాన జరిగే సమావేశానికి హాజరుకావాలని అన్ని నియోజకవర్గాల ముఖ్య నాయకులు, కార్యకర్తలకు ఇప్పటికే సమాచారం ఇచ్చారు. కాగా, పార్టీ జిల్లా కార్యాలయంలో ఇప్పటి వరకు ఎన్నికల సందర్భంగా కొత్తగూడెం మున్సిపల్ కౌన్సిలర్ల సమావేశాలు మాత్రమే జరిగాయి. నియోజకవర్గ కార్యాలయంగా మాత్రమే ఎక్కువగా ఉపయోగించారు. అయితే, ఎన్నికల అనంతరం ప్రధాన ప్రతిపక్షంగా నిర్వహించాల్సిన పాత్ర, రాబోయే పార్లమెంట్, పంచాయతీ ఎన్నికలు తదితర అంశాలపై కార్యాచరణతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి గల కారణాలను సమీక్షించేందుకు 16న సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావును అభినందించనున్నారు.

భక్తిశ్రద్ధలతో ఉర్సే షరీఫ్



సర్వమత సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తున్న ఇల్లెందు మండలం సత్యనారాయణపురంలోని హజ్రత్ నాగుల్‌మీరా దర్గా ఉర్సు ఉత్సవాలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. భక్తుల కోలాహలం మధ్య ఇల్లెందు హజ్రత్ ఖాసీం దుల్హాహ్ దర్గా షరీఫ్ నుంచి హజ్రత్ నాగుల్‌మీరా మౌలా చాన్ చిల్లా వరకు సుమారు ఏడు గంటల పాటు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం నాగుల్‌మీరాను దర్గాలో గద్దెలపైకి చేర్చారు. 8లో

రైతుబంధు @ రూ. 258.59 కోట్లు

జిల్లాలోని 1,71,064 రైతుల ఖాతాల్లో నేటి నుంచి జమ

సూపర్‌బజార్(కొత్తగూడెం): పంటల పెట్టుబడి కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించే ఆర్థిక సాయం బుధవారం నుంచి వారి ఖాతాల్లో జమ కానుంది. జిల్లాలోని 1,71,064 మంది రైతులకు రూ.258,59,25,552 రైతుబంధు సాయం అందనుంది. యాసంగి సీజన్‌లో పంటల పెట్టుబడికి ఈ మొత్తాన్ని వారు వినియోగించుకోనున్నారు.

మండలాల వారీగా రైతులకు అందనున్న మొత్తం వివరాలు..

మండలం	రైతుల సంఖ్య	జమ కానున్న మొత్తం (రూ.లలో)	మండలం	రైతుల సంఖ్య	జమ కానున్న మొత్తం (రూ.లలో)
అశ్వారావుపేట	12,510	22,74,32,902	పాల్వంచ	6,724	10,13,84,204
చండ్రుగొండ	5,820	6,91,19,465	సుజాతనగర్	6,488	7,31,17,877
దమ్మపేట	11,029	20,55,95,247	ఆళ్లపల్లి	5,037	11,76,11,750
ములకలపల్లి	9,896	15,90,32,728	అశ్వాపురం	7,909	9,86,96,778
భద్రాచలం	110	20,37,472	బూర్గంపాడు	7,571	10,22,31,221
చర్ల	11,281	13,40,27,047	గుండాల	8,710	18,79,51,135
దుమ్ముగూడెం	15,649	21,74,54,107	కరకగూడెం	5,032	7,90,31,739
చుంచుపల్లి	722	77,18,409	మణుగూరు	3,411	3,60,68,841
జూలూరుపాడు	10,173	13,07,36,234	పినపాక	6,620	7,78,84,876
కొత్తగూడెం	265	25,58,366	టేకులపల్లి	13,947	22,84,49,505
లక్ష్మీదేవిపల్లి	4,312	7,24,07,426	ఇల్లెందు	13,318	19,55,35,126
			మొత్తం	1,71,064	258,59,25,552


జులూస్‌లో ఆదివాసీల కొమ్ము, కోయ నృత్యం


నృత్యం చేస్తున్న మాలిక్ లక్ష్మీనారాయణ


ఆకట్టుకున్న అశ్వాల ప్రదర్శన

భక్తిశ్రద్ధలతో ఉర్సే షరీఫ్

- భారీ జులూస్‌తో నాగుల్‌మీరా ఊరేగింపు
- కులమతాలకు అతీతంగా పాల్గొన్న భక్తులు
- ఆకట్టుకున్న పంచవటి, సింగరి సంగీత ప్రదర్శనలు
- ప్రత్యేక ఆకర్షణగా డప్పు, గుస్సాడి కళా ప్రదర్శన

ఇల్లెందు/ఇల్లెందురూరల్: సర్వమత సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తోన్న ఇల్లెందు మండలం సత్యనారాయణపురంలోని హజ్రత్ నాగుల్‌మీరా దర్గా ఉర్సు ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన మంగళవారం భక్తుల కోలాహలం మధ్య ఇల్లెందులోని హజ్రత్ ఖాసీం దుల్హా దర్గా షరీఫ్ నుంచి మొదలైన జులూస్ హజ్రత్ నాగుల్‌మీరా మౌలా చాన్ చిల్లా వరకు కొనసాగింది. సుమారు ఏడు గంటల పాటు ఈ జులూస్ కొనసాగగా భక్తుల నుంచి ఘన స్వాగతం లభించింది.

అడుగుడుగునా ఘనస్వాగతం..

ఆకర్షణీయ అలంకరణలు, కళాప్రదర్శనలతో నాగుల్‌మీరా నిషానీల జులూస్ ముందుకు సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన కన్నీల్ కదులుతుండగా వెనుక అశ్వాలు, ఒంటెలు కదిలాయి. ఈ జులూస్‌లో ముందు నాగుల్ మీరా, ఆ తర్వాత నీల్ హైదర్ బగ్గీలు ముందుకు కదలగా బంగారు వర్ణంలో అలకరించిన పెద్ద బగ్గీలో మౌలాలీ చాంద్ నిషానీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. ఉర్సు ఉత్సవంలో నాగుల్‌మీరా నిషానీల ఊరేగింపునకు భక్తులు ఎదురేగి ఘనంగా స్వాగతం పలికారు. ఇల్లెందులోని నంబర్-2 బస్తీ హజ్రత్ ఖాసీందుల్హా దర్గా షరీఫ్ నుంచి ఉదయం 11 గంటలకు ఊరేగింపుగా నాగుల్ మీరా నిషానీలు బయలుదేరగా పాత బస్టాండ్, జగదాంబసెంటర్, ఆంబజార్, బుగ్గవాగు, కొత్త బస్‌స్టేషన్, గోవింద్ సెంటర్, సత్యనారాయణపురం మీదుగా అటవీ ప్రాంతంలో కొలువుదీరిన దర్గా వరకు సాగింది. భారీ జులూస్, అందులో నాగుల్‌మీరా నిషానీలను తిలకించేందుకు భక్తులు బారులుదీరారు.



కేరళ పంచవటి వాయిద్యంతో కళాకారులు, (ఇన్‌సెట్) నాగుల్‌మీరా నిషానీతో భక్తులు


జులూస్‌లో అయ్యప్ప మాలధారులు

సందడిగా జులూస్

హజ్రత్ నాగుల్ మీరా ఉర్సు జులూస్ సందడిగా సాగింది. తెల్లటి దుస్తులతో నాగుల్‌మీరా భక్తుల పాదయాత్రకు తోడు అయ్యప్ప మాలధారులు, సంప్రదాయ కోలాటం, ఆదివాసీ సంస్కృతిని అనుసరిస్తూ కొమ్ముకోయ నృత్యాలు, కేరళ కళాకారుల పంచవటి, సింగరి డప్పు శబ్దాలు, వాటిని అనుసరిస్తూ ఆదిలాబాద్ జిల్లా కోహినూర్ కళాకారుల గుస్సాడీ కళా ప్రదర్శన ఆకట్టుకున్నాయి. జులూస్ వీక్షించే భక్తులకు దర్గా బాధ్యులు ఆశీర్వాదం అందించారు. నాగుల్‌మీరా దర్గా మాలిక్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలను కలిసిన మార్కెటింగ్ శాఖ అధికారులు

ఖమ్మంవ్యవసాయం: రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన తుమ్మల నాగేశ్వరరావును ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల మార్కెటింగ్ శాఖ అధికారులు, మార్కెట్ అధికారులు మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల మార్కెటింగ్ శాఖ అధికారి ఎంఏ.అలీం, మార్కెటింగ్ శాఖ డీడీ రత్నం సంతోష్‌కుమార్, ఖమ్మం మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం, డీఈ కరుణాకర్‌రెడ్డి, ఏఈ సుబ్బారావు, మార్కెట్ల కార్యదర్శులు నిర్మల, అరుణకుమారి, పి.వీరంజనేయులు, ఎండీ.హిమాయిత్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఉమ్మడి ఖమ్మం జిల్లా మార్కెట్ కమిటీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు కూడా మంత్రి తుమ్మలను కలిశారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తాడేపల్లి కిరణ్‌కుమార్, ఈ.నరేష్‌తో పాటు బి.రామారావు, ప్రసాద్, సీహెచ్.బాలాజీ, హిమాయిత్ హుస్సేన్ పాల్గొన్నారు.



మంత్రి తుమ్మలను సత్కరిస్తున్న అధికారులు, మార్కెట్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

కొబ్బరి రైతుల అధ్యయన యాత్ర


కొబ్బరి పరిశ్రమలో పరిశీలిస్తున్న రైతులు

అశ్వారావుపేటరూరల్: కొబ్బరి అభివృద్ధి బోర్డు ఆధ్వర్యాన ఐదు రోజుల పాటు అధ్యయన యాత్రకు అశ్వారావుపేట, దమ్మపేట, సత్తుపల్లికి చెందిన రైతుల బృందం తమిళనాడు వెళ్లింది. ఈ సందర్భంగా వారు మంగళవారం తమిళనాడు రాష్ట్రం పొలాచ్చిలో రైతులు సాగు చేసే కొబ్బరి తోటలతోపాటు అనుబంధ పరిశ్రమలు, వాటి ఉత్పత్తులు పరిశీలించారు. కొబ్బరి ఉత్పత్తులైన పాలు, పొడి, చిప్స్, నీరా తయారీతో పాటు మార్కెటింగ్, ఆదాయం, ఉపాధిపై వివరాలు తెలుసుకున్నారు. బోర్డు ప్రాంతీయ మేనేజర్ టీవీ సాబ్, ఏడీ రగోత్తం, పరిశ్రమ ఎండీ కామరాజ్, టెక్నికల్ అధికారి గోపిరాజు, రైతులు కొక్కెరపాటి పుల్లయ్య, ఆలపాటి రాము, సాయి, భూక్యా ప్రసాద్, పసుపులేటి ఆదినారాయణ తదితరులు ఈ బృందంలో ఉన్నారు.

జూదరులు అరెస్ట్

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని వెంకటేశ్వరకాలనీలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నవారిని స్థానిక పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి, 10 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.9,520 నగదు, 6 ద్విచక్ర వాహనాలు, 9 మొబైల్ ఫోన్లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశామని టౌన్ సీఐ నాగరాజురెడ్డి వెల్లడించారు.

మహిళ అదృశ్యంపై కేసు

భద్రాచలంఅర్బన్: మహిళ కనిపించకుండా పోయిన ఘటనపై స్థానిక పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలోని లంబాడాకాలనీకి చెందిన చల్లా విజయలక్ష్మి ఈ నెల 10వ తేదీన పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి ఇంతవరకు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఆరా తీసినా ఫలితం లేకుండాపోయింది. దీంతో సదరు మహిళ తల్లి గోవమ్మ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ పీవీఎన్ రావు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.


ప్రసాదంతో వస్తున్న ఎస్పీ సతీమణి ప్రీతి

గద్దెలపైకి చేరిన నాగుల్ మీరా

హజ్రత్ ఖాసీం దుల్హా దర్గా షరీఫ్ నుంచి బయలుదేరిన నాగుల్‌మీరా నిషానీలు భారీ జులూస్‌తో మంగళవారం రాత్రి నాగుల్‌మీరా మౌలా చాన్ దర్గాకు చేరుకున్నాయి. వేలాది భక్తుల కోలాహలం మధ్య దర్గా మాలిక్ లక్ష్మీనారాయణ.. నాగుల్ మీరా, నీల్ హైదర్, మౌలాలి చాంద్‌లను దర్గాలోని గద్దెలపైకి చేర్చారు. ఈమేరకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు హాజరై నాగుల్‌మీరా మౌలాచాన్ ఆశీస్సులు పొందారు. ఈసందర్భంగా దర్గా ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కవ్వాలీ అర్ధరాత్రి వరకు కొనసాగింది. కాగా, వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్, డీఎస్పీ రమణమూర్తి, బీఆర్ఎస్ నాయకుడు దిండిగాల రాజేందర్, ఎస్పీ వినీత్ సతీమణి ప్రీతి తదితరులు దర్గాను సందర్శించి ప్రార్థన చేశారు.


కవ్వాలీలో కళాకారులు...

క్లుప్తంగా

ఈ నెల 14 నుంచి గిరిజన క్రీడోత్సవాలు


మాట్లాడుతున్న పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 14 నుంచి 16 వరకు క్రీడోత్సవాలు నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ అన్నారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం ఆయన అధికారులతో క్రీడోత్సవాలపై సమీక్షించారు. పాల్వంచ మండలం కిన్నెరసాని మోడల్ స్పోర్ట్స్ స్కూల్ క్రీడా ప్రాంగణంలో 14న బాలురకు, 15 బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, క్యారమ్స్, టెన్నిస్, చెస్‌తో పాటు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. భద్రాచలం, ఖమ్మం డీడీలు మణెమ్మ, విజయలక్ష్మితోపాటు అధికారులు రమణయ్య, నరసింహారావు, చంద్రమోహన్, రూపాదేవి, తిరుమల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని యువకుడి దాడి

ఇల్లెందురూరల్: మండలంలోని బొజ్జాయిగూడెం సమ్మక్క - సారలమ్మ గద్దెల వద్ద మంగళవారం మతిస్థిమితం లేని ఓ యువకుడు దాడి చేయడంతో ఆటోడ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. టేకులపల్లి నుంచి ఇద్దరు ప్రయాణికులతో ఇల్లెందు వస్తున్న ఆటోలో సమ్మక్క గద్దెల వద్ద ఆటో ఎక్కిన యువకుడు డ్రైవర్‌తో ఘర్షణ పడ్డాడు. ఇరువురి మధ్య మాటామాటా పెరిగి దాడి చేసుకున్నారు. ఈ క్రమంలో మతిస్థిమితం లేని వ్యక్తి చేతిలో ఉన్న చైన్ తగలడంతో డ్రైవర్‌కు మెడ భాగం వద్ద తెగగా రక్తస్రావమైంది. దీంతో ఆటోలో ఉన్న ప్రయాణికులు ఆయనను ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఇంతలో మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తిని వెతుక్కుంటూ వచ్చిన బంధువులు ఆటోడ్రైవర్‌పై, దాడి చేసిన వ్యక్తిపై ఆటోడ్రైవర్ పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,454

పట్టుబట్టారు.. సాధించారు!


ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

విద్యార్థుల ఆందోళనతో ఉపాధ్యాయుడి డిప్యూటేషన్ రద్దు

తిరుమలాయపాలెం: తెలుగు ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై పంపడంతో బోధన జరగక ఇబ్బంది పడుతున్నందున తమ ఉపాధ్యాయుడ్ని తిరిగి కేటాయించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్లకార్డులతో ఆందోళనకు దిగారు. తిరుమలాయపాలెం మండలం కాకరవాయి జిల్లా పరిషత్ పాఠశాలలో గతంలో ఇద్దరు తెలుగు ఉపాధ్యాయులు ఉండగా, శివరాంను పైనంపల్లి పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపించారు. ఇంతలోనే మరో ఉపాధ్యాయుడికి పదోన్నతి లభించడంతో బదిలీపై వెళ్లాడు. ఫలితంగా తెలుగు బోధించే వారులేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యాన శివరాంను తిరిగి కేటాయించాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. చివరకు ఈ విషయం జిల్లా అధికారుల దృష్టికి వెళ్లడంతో పైనంపల్లి పాఠశాలకు వేరే ఉపాధ్యాయుడిని కేటాయించి శివరాంను తిరిగి కాకరవాయి పాఠశాలలో పనిచేసేలా ఆదేశాలు జారీ చేశారు. బుధవారం నుండి ఆయన కాకరవాయి పాఠశాలకు వస్తారని సమాచారం అందడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

చోరీల నిందితుడు అరెస్ట్

భద్రాచలంఅర్బన్: పలు జిల్లాల్లో చోరీలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని పట్టణంలోని ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. టౌన్ సీఐ నాగరాజురెడ్డి కథనం ప్రకారం.. పట్టణంలోని గోల్డ్‌స్మిత్ కాలనీకి చెందిన మాధవరావుకు చెందిన ద్విచక్రవాహనం గత నెల 20వ తేదీన చోరీకి గురైంది. ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ క్రమంలో పట్టణానికి చెందిన మైపా నవీన్, పూజారి సూర్య, సాయితేజను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా మాధవరావుకు చెందిన బైక్ చోరీ విషయం వెలుగుచూసింది. అయితే, ఆ బైక్ ఎవరు చోరీ చేశారనే అంశంపై లోతుగా విచారించగా దురిశెట్టి స్వామినిరంజన్ పేరు బయటకొచ్చింది. ఆయన్ను సారపాక నుంచి భద్రాచలం వస్తున్న క్రమంలో పోలీసులు పట్టుకుని విచారించగా పలు ప్రాంతాల్లో అపహరించిన బంగారం దాదాపు 15 తులాల వరకు ఉందని గుర్తించారు. స్వామినిరంజన్ నిత్యం దొంగతనాలు చేసి పట్టణానికి చెందిన సాయితేజ్‌కు ఇచ్చి విక్రయించేందుకు ప్రేరేపిస్తుంటాడని విచారణలో తేలింది. ప్రస్తుతం స్వామినిరంజన్ వాడుతున్న ద్విచక్రవాహన వివరాలు సేకరించగా అది కూడా ఇతర ప్రాంతంలో చోరీచేసినట్లు తెలిసింది. మణుగూరు, గోదావరిఖని ప్రాంతాల్లో చోరీలకు పాల్పడి జైలుకెళ్లి వచ్చినట్లుగా విచారణలో తేలిందని సీఐ నాగరాజురెడ్డి వెల్లడించారు. పట్టుబడిన స్వామినిరంజన్‌పై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామని సీఐ వివరించారు. కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ పీవీఎన్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగరాజురెడ్డి

ముగ్గురిపై పోక్సో కేసు

కల్లూరు: ఓ యువతిని వివాహం చేసుకుంటానని మోసగించిన ఘటనలో యువకుడితో పాటు ఆయన తల్లిదండ్రులపై పోక్సో కేసు నమోదైంది. కల్లూరు ఎస్ఐ పి.రఘు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కిష్టయ్యబంజర్ గ్రామానికి చెందిన యువతిని అదే గ్రామానికి చెందిన గుగులోత్ నాగబాబు ప్రేమించానని, పెండ్లి చేసుకుంటానని శారీరకంగా లొంగదీసుకున్నాడు. చివరికి పెళ్లికి నిరాకరించడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన ఆమె మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో నాగబాబుతో పాటు ఆయన తల్లిదండ్రులు భద్రు-బోడీపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

108లో గర్భిణి ప్రసవం


పుట్టిన బిడ్డతో సిబ్బంది

గుండాల: పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణిని 108లో కొత్తగూడెం తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రసవించిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఆళ్లపల్లి మండలంలోని డబుల్‌బెడ్రూం సముదాయంలో నివసిస్తున్న గర్భిణీ ఇర్ప రాధ (38)కు 8వ కాన్పులో భాగంగా నొప్పులు ఎక్కువ కావడంతో స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ఉన్న సిబ్బంది పరీక్షించి కొత్తగూడెం ఆస్పత్రికి రిఫర్ చేశారు. 108లో కొత్తగూడెం వెళ్తుండగా మధ్యలోనే మగబిడ్డకి జన్మనిచ్చింది. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని సిబ్బంది తెలిపారు. అనంతరం వారిని కొత్తగూడెం వైద్యశాలలో చేర్పించామని చెప్పారు.

పురుగులమందు తాగిన వ్యక్తి మృతి

పాల్వంచ: పురుగులమందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని కేశవాపురం గ్రామానికి చెందిన బండి శ్రీను (48) కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. మనస్తాపానికి గురై ఈ నెల 11వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డిమందు తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య జానకమ్మ ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చలిమంట అంటుకుని వృద్ధుడు...


బూస పుల్లయ్య (ఫైల్)

పెనుబల్లి: చలి నుంచి ఉపశమనం కోసం మంచం కింద పెట్టుకున్న కొద్దిపాటి మంట పెద్దదై మంచంపై వృద్ధుడికి అంటుకోవడంతో మృతి చెందిన ఘటన ఇది. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం బ్రహ్మళకుంటకు చెందిన బూస పుల్ల య్య(70) ఆదివారం రాత్రి వేడి కోసం తాను పడుకున్న మంచం కింద కొన్ని నిప్పులు పెట్టుకొని నిద్రపోయాడు. అర్ధరాత్రి దాటాక నిప్పులు పుల్లయ్య కప్పుకున్న దుప్పటికి అంటుకుని మంటలు చెలరేగి ఆయన శరీరం కాలింది. పుల్లయ్య అరుపులతో మేల్కొన్న కుటుంబీకులు మంటలు ఆర్పి ఆయనను కల్లూరు ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

శ్మశానవాటికలో ధాన్యం రాశులు


వైకుంఠధామం ఆవరణలో ఆరబోసిన ధాన్యం రాశులు

అశ్వారావుపేటరూరల్: ఇదేమిటి.. యార్డులో ఉండాల్సిన ధాన్యం రాశులు.. శ్మశానవాటిక (వైకుంఠధామం)లో ఉన్నాయని అనుకుంటున్నారా. అశ్వారావుపేట మండలం జమ్మిగూడెం గ్రామానికి చెందిన రైతు సాగు చేసిన వరిపొలం ఇటీవలె చేతికందింది. ధాన్యాన్ని ఆరబెట్టేందుకు యార్డులు, ఖాళీ స్థలాలు లేకపోవడంతో మంగళవారం వైకుంఠధామం ఆవరణలో ఆరబోశాడు. దీనిని చూసిన వారంతా శ్మశానవాటిక దిక్కు అయిందని వాపోతున్నారు.

క్లుప్తంగా...

జెన్‌కో ఏఈ పరీక్ష వాయిదా

'ప్రజావాణి'లో వచ్చిన విజ్ఞప్తిపై సర్కారు సానుకూల నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ప్రజాభవన్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో నిరుద్యోగ అభ్యర్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు జెన్‌కో ఏఈ రాత పరీక్షను రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేసింది. తెలంగాణ రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో)లో అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ) పోస్టుల భర్తీకి ఈ నెల 17న నిర్వహించతలపెట్టిన రాతపరీక్షను వాయిదా వేసినట్టు ఆ సంస్థ మానవ వనరుల విభాగం డైరెక్టర్ అశోక్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు ఇతర సంస్థల/ప్రభుత్వ పోటీపరీక్షలు ఉండటంతో జెన్‌కో ఏఈ రాతపరీక్షను వాయిదా వేయాలని అభ్యర్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఏఈ పరీక్షల తదుపరి షెడ్యూల్‌ను సంస్థ వెబ్‌సైట్ www. tsgenco.co.inలో ప్రకటిస్తామన్నారు. జెన్‌కోలో ఏఈ(ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్) పోస్టుల భర్తీకి సంస్థ యాజమాన్యం అక్టోబర్ 4న నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే.

హెరాయిన్ రవాణా కేసులో నిందితురాలికి పదేళ్ల జైలు శిక్ష

- జాంబియా దేశస్తురాలి నుంచి రూ. 20 కోట్ల విలువైన మత్తు పదార్థాలు స్వాధీనం
- 2021లో అరెస్ట్ చేసిన డీఆర్ఐ

సాక్షి, హైదరాబాద్: హెరాయిన్ అక్రమ రవాణా కేసులో పట్టుబడిన నిందితురాలికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ రంగారెడ్డి జిల్లా కోర్టు తీర్పునిచ్చినట్టు డీఆర్ఐ(డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) అధికారులు తెలిపారు. ఈ మేరకు డీఆర్ఐ అధికారులు మంగళవారం ఓ ప్రకటన జారీ చేశారు. 2021 జూలై 19న శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో జాంబియా దేశస్తురాలి వద్ద నుంచి రూ.20.80 కోట్ల విలువైన 3200 గ్రాముల హెరాయిన్‌ను డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌డీపీఎస్ యాక్ట్ సెక్షన్ 21, 23ల కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. నిందితురాలు తన సూట్‌కేసులో రహస్యంగా హెరాయిన్ దాచి అక్రమంగా రవాణా చేస్తున్నట్టు పూర్తి ఆధారాలను డీఆర్ఐ అధికారులు కోర్టుకు సమర్పించారు. కేసు నిరూపితం కావడంతో కోర్టు నిందితురాలికి పదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.లక్ష జరిమానా విధించింది. జరిమానా చెల్లించకపోతే మరో ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష కొనసాగించాలని తీర్పులో వెల్లడించారు.

దొంగలు దూరారు!

టీడీపీ సానుభూతిపరులు.. పలు చోట్ల ఓటర్లుగా నమోదు

కుప్పం సహా 175 నియోజకవర్గాల్లో 40.76 లక్షలకుపైగా బోగస్ ఓట్లు

- అధికార పార్టీ ఓటర్లపై గురి..కుప్పలు తెప్పలుగా ఫారం 7 దరఖాస్తులు
- విచారణ జరిపి ఆ దరఖాస్తులన్నీ నకిలీవని తేలుస్తున్న బీఎల్వోలు
- దీంతో ఎన్నికల యంత్రాంగంపై దాడులకు తెగబడుతున్న పచ్చముఠాలు
- నకిలీ ఓట్లను కొనసాగించేందుకు 8 జిల్లాల్లో బ్లాక్‌మెయిల్ రాజకీయాలు



సాక్షి, అమరావతి: ఏపీలో నాలుగున్నరేళ్లుగా ముఖ్యమంత్రి జగన్ అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో ప్రజాస్వామ్య ప్రక్రియపై విశ్వాసం కోల్పోయిన విపక్షం అడ్డదారులు పడుతోంది! ఏపీ వ్యాప్తంగా ఓట్ల దొంగలు స్వైర విహారం చేస్తున్నారు! అధికార పార్టీ చేపట్టిన సామాజిక సాధికారయాత్ర, ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాలకు ప్రజలు బ్రహ్మరథం పడుతుండటంతో వైఎస్సార్‌సీపీని ఒంటరిగా ఎదుర్కోవడం అసాధ్యమనే నిర్ణయానికి వచ్చిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు జనసేనతో చేతులు కలిపినా ఫలితం శూన్యమని గుర్తించారు. దీంతో 2019 ఎన్నికలకు మించి మరోసారి ఘోర పరాజయం తప్పదని పసిగట్టిన టీడీపీ పెద్దలు.. దొడ్డిదారి పట్టారు! తమకు మాత్రమే సాధ్యమైన వ్యవస్థలోకి వైరస్‌లా చొరబడి చాపకింద నీరులా ఓటర్ల జాబితాలో దొంగ ఓట్లను చేర్పిస్తున్నారు.

40,76,580కిపైగా దొంగ ఓట్లు

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి అక్టోబర్ 27న విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాలో ఆంధ్రప్రదేశ్‌లో 4,02,21,450 మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు. ఇందులో సుమారు 40,76,580కిపైగా దొంగ ఓట్లను టీడీపీ నేతలు చేర్పించినట్లు ప్రజాసంఘాలు, రాజకీయ పరిశీలకులు గుర్తించారు. తమ పార్టీ సానుభూతిపరుల ఓట్లను పలు నియోజకవర్గాల్లో ఒకే ఫోటోతో ఇంటి పేర్లు మార్చి జాబితాలో చేర్పించారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఓటు హక్కు కలిగి ఉన్న తమ పార్టీ సానుభూతిపరుల పేర్లను సైతం రాష్ట్రంలోని ఓటర్ల జాబితాలో చేర్పించారు. ఒకే డోర్ నెంబర్‌పై వందల ఓట్లను నమోదు చేయించారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో 46,165 పోలింగ్ బూత్‌ల పరిధిలోనూ ఇదే కథ. ఇప్పటికీ దొంగ ఓట్లను నమోదు చేయించే ప్రక్రియను కొనసాగిస్తున్నారు. మరోవైపు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు జీవించి ఉన్నా చనిపోయినట్లు, స్థానికంగా నివాసం ఉంటున్నా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు చిత్రీకరిస్తూ ఆ ఓట్లను తొలగించేందుకు కుప్పలు తెప్పలుగా ఫారం–7 దరఖాస్తులు సమర్పిస్తున్నారు. బీఎల్వోల (బూత్ లెవల్ ఆఫీసర్లు) విచారణలో ఇవన్నీ వెలుగులోకి వస్తున్నాయి.

దాడులు.. బ్లాక్ మెయిల్

ఫారం 7లపై విచారణ జరిపి దొంగ ఓట్లను ఆధారాలతోసహా తేల్చి ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్న బీఎల్వోలు, తహసీల్దార్లపై టీడీపీ నేతలు దాడులకు దిగుతున్నారు. పల్నాడు జిల్లా వినుకొండలో శావల్యపురం తహసీల్దార్‌పై నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ ఇటీవల దాడికి తెగబడ్డారు. తాము చేర్పించిన దొంగ ఓట్లను తొలగించకుండా కలెక్టర్లను సైతం టీడీపీ నేతలు బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. అనంతపురం, శ్రీకాకుళం, అంబేడ్కర్ కోనసీమ, గుంటూరు, అన్నమయ్య, బాపట్ల, తిరుపతి, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లపై ఇటీవల రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి టీడీపీ నేతలు ఫిర్యాదు చేయడమే అందుకు నిదర్శనం.

నాడు.. ఐదు లక్షల దొంగ ఓట్లతో

రాష్ట్ర విభజన తర్వాత 2014 ఎన్నికల నాటికి ఓటర్ల జాబితాలో సుమారు 35 లక్షలకుగా దొంగ ఓట్లు ఉన్నట్లు ప్రజాసంఘాలు గుర్తించాయి. ఆ ఎన్నికల్లో కేవలం ఐదు లక్షల ఓట్ల తేడాతో టీడీపీ అధికారంలోకి వచ్చింది. ఆ దొంగ ఓట్లను తొలగించి ఉంటే 2014లోనే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి ఉండేదని అప్పట్లోనే ప్రజా సంఘాలు, రాజకీయ పరిశీలకులు తేల్చిచెప్పారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

గెలుపు వ్యూహం మాకు తెలుసు

- టీడీపీ – జనసేన ముందు వాటి ఇల్లు చక్కదిద్దుకోవాలి: సజ్జల
- ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలో వారికే క్లారిటీ లేదు
- మరింత మెరుగైన ఫలితాల కోసమే మార్పుచేర్పులు



సాక్షి, అమరావతి: టీడీపీ – జనసేన ముందు వాటి ఇల్లు చక్కదిద్దుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి హితవు పలికారు. ఇంతవరకూ ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలో వారికే స్పష్టత లేదని వ్యాఖ్యానించారు. టీడీపీ శిథిలావస్థకు చేరిన సౌధమని, పవన్‌ను నమ్ముకొని చంద్రబాబు ప్రయాణం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. తాడేపల్లిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గెలుపు అవకాశాలను మెరుగుపరుచుకుని మరింత మెరుగైన ఫలితాలను సాధించేందుకే మార్పుచేర్పులు చేపట్టామని, అది తమ పార్టీ అంతర్గత వ్యవహారమన్నారు. నియోజక వర్గాల్లో నాయకుడిని మార్చినప్పుడు క్యాడర్ కొత్త ఇబ్బంది పడటం సహజమేనని, అందరినీ పిలిచి మాట్లాడతామని చెప్పారు. అందరినీ సమన్వయ పరుచుకుంటూ, సముచిత స్థానం కల్పిస్తూ ముందుకు వెళ్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎలా గెలవాలో.. అందుకు ఏ వ్యూహం అనుసరించాలో తమకు తెలుసన్నారు. కుప్పం సహా 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమని స్పష్టం చేశారు.

నిరంతరం ప్రజాసేవలోనే..

బీసీల జనాభా అధికంగా ఉన్న నియోజక వర్గాల్లో బలహీన వర్గాలకు చెందిన అభ్యర్థులను బరిలోకి దింపకుండా చంద్రబాబు, లోకేశ్ ఎందుకు పోటీ చేస్తున్నారని సజ్జల ప్రశ్నించారు. 3 వేల కి.మీ. పాదయాత్ర పూర్తి చేశాడని టీడీపీ గొప్పలు చెప్పుకుంటున్న లోకేశ్ ఎక్కడ నడిచాడో ఎవరికీ తెలియటం లేదని ఎద్దేవా చేశారు. సీఎం జగన్ పేరు ప్రస్తావించే అర్హత కూడా లోకేశ్‌కు లేదన్నారు. ఇప్పటివరకు 99.5 శాతం హామీలను నెరవేర్చి సీఎం జగన్ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని తెలిపారు. రెండేళ్ల ముందు నుంచే ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలతో గడప గడపకూ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ నిరంతరం ప్రజాసేవలో నిమగ్నం చేశారని చెప్పారు. ప్రజల ఆశలు నెరవేర్చే నేతగా సీఎం జగన్ ఆదరణ చూరగొన్నారని, పాజిటివ్ ఓటు తమ బలమని పేర్కొన్నారు.

కేసులపై బయటెక్కడా మాట్లాడొద్దు

చంద్రబాబుకు సుప్రీంకోర్టు ఆదేశం

- స్కిల్ కేసుతోపాటు ఫైబర్‌నెట్ కేసుకూ ఇది వర్తిస్తుంది
- ఫైబర్‌నెట్ కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వచ్చే నెల 17కి వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: టీడీపీ అధినేత చంద్రబాబు తనపై ఉన్న కేసుల గురించి బహిరంగంగా ఎక్కడా మాట్లాడవద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు చంద్రబాబు తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రాకు సూచించింది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసే కాకుండా ఫైబర్‌నెట్ కేసుకు కూడా ఇది వర్తిస్తుందని తేల్చిచెప్పింది. ఫైబర్‌నెట్ కుంభకోణానికి సంబంధించి చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం త్రివేదిలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా సీఐడీ తరఫు సీనియర్ న్యాయవాది రంజిత్ కుమార్ వాదనలు వినిపిస్తూ.. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో బెయిల్ విషయాన్ని ప్రస్తావించారు. 'స్కిల్'కేసులో తానెలాంటి రాజకీయ ప్రకటన చేయనని చెప్పిన చంద్రబాబు డిసెంబర్ 8న దాన్ని ఉల్లంఘించారని న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. ఇలాంటివి ఏమున్నా రికార్డు రూపంలో కోర్టుకు అందజేయాలని ధర్మాసనం పేర్కొంది. ఈ సమయంలో సిద్ధార్థ లూథ్రా జోక్యం చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు గురించి చెప్పాల్సింది చాలా ఉందన్నారు. అనంతరం ఫైబర్‌నెట్ కేసు విచారణను జనవరి 17కి వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. కోర్టు మౌఖికంగా గతంలో చెప్పింది (ఫైబర్‌నెట్ కేసులో చంద్రబాబుని అరెస్టు చేయబోమని) కొనసాగుతుందా అని లూథ్రా ధర్మాసనాన్ని కోరగా అవునని తెలిపింది. ఈ దశలో రంజిత్ కుమార్ జోక్యం చేసుకొని అయితే కేసులపై చంద్రబాబు ఎలాంటి ప్రకటన చేయరాదని కోరారు. ఈ బాధ్యత లూథ్రాదేనని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తమకు బాధ కలిగించేది కాబట్టే ఇలా అడుగుతున్నామని రంజిత్ కుమార్ కోర్టు దృష్టికి తెచ్చారు. ''మీ క్లయింట్ కేసు గురించి ఎలాంటి ప్రకటన చేయకూడదు''అని లూథ్రానుద్దేశించి జస్టిస్ బోస్ వ్యాఖ్యానించారు. 'స్కిల్'కేసులో పరిమిత ఆదేశాలు ఉన్నాయని.. వాటిని గౌరవిస్తున్నామని లూథ్రా పేర్కొన్నారు. ఏదేమైనప్పటికీ దగ్గరలో ఎన్నికలు లేవు కదా అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఏపీ అదనపు అడ్వొకేట్ జనరల్ కేసు గురించి ప్రకటనలు చేయడమే కాకుండా హైదరాబాద్, ఢిల్లీలో విలేకరుల సమావేశం నిర్వహించారని, తన గురించి కూడా మాట్లాడారని లూథ్రా కోర్టు దృష్టికి తెచ్చారు. అయితే రికార్డు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. ఈ కేసులో తీర్పు కోసం ఎదురుచూడడానికి వాయిదా పడిన మరో కేసులో సంయమనంతో ఉండాలని లూథ్రా అంటున్నారని రంజిత్ కుమార్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రెండువైపులా జెంటిల్‌మెన్ వ్యవహారం ఉండాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

175 స్థానాల్లో విజయమే లక్ష్యం

- కొన్ని నియోజకవర్గాల్లో పరిస్థితుల దృష్ట్యా మార్పులు, చేర్పులు
- పార్టీకోసం పనిచేసేవారికి సీటు: వై.వి.సుబ్బారెడ్డి



సాక్షి, అనకాపల్లి: ఏపీలో 175 నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కొన్ని మార్పులు, చేర్పులు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి చెప్పారు. కొన్ని నియోజకవర్గాల్లో పరిస్థితుల దృష్ట్యా మార్పులు చేస్తున్నామని, అందులో భాగంగానే రాష్ట్రంలో 12 నియోజకవర్గాల్లో పలువురు ఎమ్మెల్యేలకు స్థానచలనం, నూతన ఇన్‌చార్జిలను నియమించారని తెలిపారు. ఆయన మంగళవారం అనకాపల్లి జిల్లా రోలుగుంటలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీలో చాలా మార్పులు ఉండనున్నాయన్నారు. ఇప్పటికే విశాఖ జిల్లాలో గాజువాక నియోజకవర్గంలో సమన్వయకర్తని మార్చామని చెప్పారు. రెండువారాల కిందటే స్థానిక ఎమ్మెల్యే నాగిరెడ్డికి తెలిపామన్నారు. తమకు సీటు ఇచ్చినా, ఇవ్వకపోయినా ఈ రాష్ట్రానికి జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్న లక్ష్యంతో తాము పనిచేస్తామని ఎమ్మెల్యే నాగిరెడ్డి, ఆయన తనయుడు దేవన్‌రెడ్డి చెప్పారని తెలిపారు. అంతేగాకుండా పార్టీలో కష్టపడి పనిచేసే మంచి అభ్యర్థికి సీటు ఇవ్వమని కూడా వారు సూచించారన్నారు. వీరిద్దరూ రాజీనామా చేశారనేది దుష్ప్రచారం మాత్రమేనని చెప్పారు. విశాఖ పార్టీ కార్యాలయంలో మంగళవారం స్వయంగా దేవన్ రాజీనామా వార్తను తోసిపుచ్చారని తెలిపారు.

జిల్లా వార్తలు

తక్కువ ఎత్తులో విమానం చక్కర్లు



అశ్వాపురంలో చక్కర్లు కొడుతున్న విమానం

అశ్వాపురం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల్లో తక్కువ ఎత్తులో ఓ విమానం ఎరుగుతోంది. రెండు రోజులుగా ఈ విమానం చక్కర్లు కొడుతుండగా ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు. అశ్వాపురం, బూర్గంపాడు, మణుగూరు, భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, జూలురుపాడు, చింతకాని తదితర ప్రాంతాల్లో విమానం పలుసార్లు తిరగడం చర్చనీయాంశంగా మారింది. అయితే, విమానంలో ఎవరు వెళ్తున్నారు, ఎందుకు తిరుగుతుందనే విషయం తెలియరాలేదు. ఈవిషయమై వివిధ శాఖల అధికారులను సంప్రదించినా తమకు సమాచారం లేదని తెలిపారు. కాగా, పరిశోధనల నిమిత్తం ఈ విమానంలో శాస్త్రవేత్తలు లేదంటే ఏదైనా సంస్థ బాధ్యులు పర్యటిస్తూ ఉండొచ్చని సమాచారం.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రెండో స్థానం



వేముల సాహితి

ఖమ్మంస్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రిలోని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీలో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు జరిగిన సౌత్, వెస్ట్ జోన్ పరిధి మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఖమ్మానికి చెందిన వేముల సాహితి రెండో స్థానంలో నిలిచి రజత పతకం కైవసం చేసుకుంది. 78 కేజీల కేటగిరిలో వేముల సాహితి ప్రతిభ కనబర్చి ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు అర్హత సాధించింది. ఖమ్మంలోని కవిత డిగ్రీ కళాశాలలో చదువుతున్న ఆమెను కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ పారుపల్లి ఉషాకిరణ్, ప్రిన్సిపాల్ డాక్టర్ రాధాకృష్ణ తదితరులు అభినందించారు.

అమెరికా వైస్ ప్రెసిడెంట్ కమలాహారీస్‌తో భేటీ

పాల్వంచ: అమెరికా వైస్ ప్రెసిడెంట్ కమలాహారీస్‌ను పాల్వంచకు చెందిన శ్యామలా గోపాలన్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ నల్లా సురేశ్‌రెడ్డి మంగళవారం కలిశారు. అమెరికాలోని వాషింగ్టన్ డీసీలోని ఆమె గృహంలో జరిగిన కార్యక్రమంలో కలిసిన ఆయన పలు అంశాలపై మాట్లాడారు. కాగా, కమలాహారీస్ ఆహ్వానం మేరకు సురేశ్‌రెడ్డి అక్కడకు వెళ్లారు.

సామాన్య భక్తులకు ఇబ్బంది కలగొద్దు

- పకడ్బందీ ఏర్పాట్లతో ముక్కోటి ఉత్సవాలను విజయవంతం చేద్దాం
- అధికారులతో సమీక్షించిన భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక
- భద్రాద్రి, పర్ణశాలలో ఏర్పాట్లు పరిశీలన



భద్రాచలం: మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక, పక్కన అధికారులు



దుమ్ముగూడెం: పర్ణశాలలో పంచవటి కుటీరాన్ని సందర్శిస్తున్న కలెక్టర్

భద్రాచలం: భద్రాచలం పుణ్యక్షేత్రంలో ఈ నెల 22, 23వ తేదీల్లో జరిగే తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం వీక్షణకు వచ్చే సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ ప్రియాంక అల సూచించారు. ఉత్సవాల నిర్వహణపై భద్రాచలంలోని సబ్ కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సామాన్య భక్తులతోపాటుగా వీఐపీల సెక్టార్ల విభజన పకడ్బందీగా చేసి ఇతరులు ప్రవేశించకుండా చూడాలని తెలిపారు. సెక్టార్ల వారీగా పోలీస్, ఇతర శాఖల అధికారులు విధులు సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. అలాగే, వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలు గుర్తించాలని, తాగునీరు, తాత్కాలిక వసతి గదులు ఏర్పాటు చేయాలని, భక్తులు గోదావరి లోపలకు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఇంకా స్వామివారి ప్రసాదాలు అందించేందుకు ప్రత్యేక కౌంటర్లు సిద్ధం చేయాలని, భక్తులకు సమాచారం ఇచ్చేలా ప్రధాన కూడళ్లలో కేంద్రాలు ఏర్పాటు చేయాలని, భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు నడిపించాలని సూచించారు. పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని డీపీఓను కలెక్టర్ ఆదేశించారు. ఇంకా భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్, అత్యవసర వైద్య సేవలకు కేంద్రాలు, ప్రధాన ఆస్పత్రిలో బెడ్లు సమకూర్చడంతో పాటు 22, 23వ తేదీల్లో భద్రాచలంలో మద్యం అమ్మకాలు నిషేధించాలని సూచించారు.

ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో ముక్కోటి ఉత్సవాల సందర్భంగా 22వ తేదీన తెప్పోత్సవానికి హాజరయ్యే భక్తులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు పక్కాగా చేయాలని కలెక్టర్ ప్రియాంక అల ఆదేశించారు. మండలంలోని పర్ణశాలను మంగళవారం సందర్శించిన ఆమె తెప్పోత్సవం నిర్వహించే గోదావరి ప్రాంతాన్ని పరిశీలించి ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్షించారు. శానిటేషన్, తాగునీరు, విద్యుత్ సమస్యలు ఎదురుకాకుండా చూడాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ పర్ణశాలలో రామయ్యను దర్శించుకోగా, ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికి పూజలు చేయించారు. ఆ తర్వాత పంచవటి కుటీరాన్ని సందర్శించి విశిష్టతను తెలుసుకున్నారు. ఈ సమావేశాల్లో అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్‌రాజు, డీఆర్ఓ రవీంద్రనాథ్, దేవస్థానం ఈఓ రమాదేవి, డీఎంహెచ్ఓ శిరీష, ఈఈలు రవీందర్, రాంప్రసాద్, ఆర్డీఓ మంగీలాల్, డీఎల్‌పీఓ లక్ష్మీరమాకాంత్, జెడ్పీటీసీ సభ్యురాలు తెల్లం సీతమ్మ, ఎంపీపీ రేసు లక్ష్మి, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ ముత్యాలరావు, సీఐ దోమల రమేశ్, ఎస్ఐ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

అటు ఫుల్.. ఇటు నిల్!

ఖాళీగా వెళ్తున్న లగ్జరీ, డీలక్స్ బస్సులు



రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని గత శనివారం నుంచి ప్రారంభించింది. అయితే, పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనే ఉచిత ప్రయాణానికి అనుమతిస్తున్నారు. దీంతో ఆయా బస్సుల్లో విపరీతమైన రద్దీ ఉంటుండగా.. లగ్జరీ, సూపర్ డీలక్స్ బస్సులు మాత్రం ఖాళీగా దర్శనమిస్తున్నాయి. చాలావరకు బస్సుల్లో మహిళలే కానరావడం లేదు. పురుషులు కూడా తక్కువగానే ఉండటంతో బస్సులు అలాగే రాకపోకలు సాగిస్తున్నారు. ఖమ్మం నుంచి భద్రాచలానికి శనివారం వెళ్తున్న లగ్జరీ బస్సులో కేవలం పురుషులు మాత్రమే ఉన్న దృశ్యం ఇది.

–ఖమ్మంఅర్బన్

నేడు డీసీసీబీ పాలకవర్గం భేటీ

- సీఈఓగా బాధ్యతలు స్వీకరించనున్న రెహమాన్
- చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి అడుగులు?

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) పాలకవర్గ సమావేశం బుధవారం జరగనుంది. ఖమ్మం గాంధీచౌక్‌లోని ప్రధాన కార్యాలయంలో ఉదయం 11.30గంటలకు బ్యాంకు చైర్మన్ కూరాకుల నాగభూషణం అధ్యక్షతన సమావేశం నిర్వహణకు నిర్ణయించారు. డీసీసీబీ సీఈఓగా ఇటీవల ఎస్‌బీఐ రిటైర్డ్ డీజీఎం అబీద్ ఉర్ రెహమాన్‌ను ఎంపిక చేశారు. అయితే, పాలకవర్గ సమావేశంలో సీఈఓ నియామకాన్ని తీర్మానించాల్సి ఉన్నా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యాన ఆలస్యమైంది. ఈమేరకు బుధవారం జరిగే సమావేశంలో పాలకవర్గం ఆమోదం అనంతరం సీఈఓగా ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు. అలాగే, అజెండాలో పేర్కొన్న అంశాలు, ఈ ఏడాది అర్ధ సంవత్సర ఆదాయ, వ్యయాలపై కూడా చర్చించే అవకాశముంది.

చైర్మన్‌పై అవిశ్వాసం దిశగా అడుగులు

డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణంపై తిరుగుబావుటా ఎగురవేసేందుకు పాలకవర్గ సభ్యులు పలువురు అడుగులు వేస్తున్నట్లు చర్చ జరుగుతోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి పాలై, కాంగ్రెస్ అధికార పీఠాన్ని చేజిక్కించుకుంది. దీంతో నూతన ప్రభుత్వం రాష్ట్రంలోని పలు కార్పొరేషన్ పదవులను రద్దు చేసినా, డీసీసీబీ చైర్మన్‌ను తొలగించే అవకాశం లేదు. ఈమేరకు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి చైర్మన్‌ను గద్దె దించాలనే యోచనలో పలువురు ఉన్నట్లు సమాచారం. నెల క్రితం బ్యాంకు ఉపాధ్యక్షుడు దొండపాటి వెంకటేశ్వరరావు రాజీనామా చేయగా, అసెంబ్లీ ఎన్నికల సమయాన పలువురు నేతలు పార్టీలు మారారు. దీంతో కాంగ్రెస్ అధినాయకత్వం సూచన మేరకు పాలకవర్గ సభ్యుల బలం ఆధారంగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలనే యోచనకు వచ్చినట్లు తెలుస్తుండగా, దీనికి మరికొంత సమయం పడుతుందని భావిస్తున్నారు.

కార్మిక హక్కులు సాధించే వరకు విశ్రమించం..



మాట్లాడుతున్న టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి

సత్తుపల్లిరూరల్: కార్మికుల న్యాయమైన హక్కులు, ప్రయోజనాలు సాధించేవరకు విశ్రమించబోమని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిరియాల రాజిరెడ్డి తెలిపారు. సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీలో మంగళవారం నిర్వహించిన నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ సంఘాలుగా చెప్పుకునే ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ కార్మికుల హక్కుల రక్షణకు ఏనాడూ పాటుపడలేదన్నారు. డిపెండెంట్ ఉద్యోగాల కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్రంగా కృషి చేశారని గుర్తుచేశారు. కొందరు కోర్టుల్లో కేసులు వేసి ఇబ్బంది పెట్టినా, అధికారులు కుదరదని చెప్పినా కేసీఆర్ నిబంధనలు సవరించి వీలైనంత ఎక్కువ మందికి ఉద్యోగాలు వచ్చేలా చొరవ తీసుకున్నారని తెలిపారు. ఈ మేరకు ప్రస్తుత గుర్తింపుసంఘం ఎన్నికల్లో టీబీజీకేఎస్ గెలుస్తుందని రాజిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు అబ్దుల్ రజాక్, కాపు కృష్ణ, క్రాంతి కుమార్, రమేశ్‌బాబు, ఉపేంద్రాచారి, చెన్నకేశవరావు, మాధవరెడ్డి, విజేందర్, రామస్వామి, మురళీకృష్ణ, సుబ్బారెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

సరైన సమయంలో చికిత్సతో మేలు



గ్రహణమొర్రి బాధితులను పరీక్షిస్తున్న వైద్యులు

కొత్తగూడెంఅర్బన్: సరైన సమయంలో శస్త్రచికిత్స చేయించడం ద్వారా గ్రహణమొర్రితో బాధపడే పిల్లలకు లబ్ధి చేకూరుతుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి ఎస్‌కే సైదులు తెలిపారు. సమగ్ర శిక్ష తెలంగాణ, బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ సౌజన్యంతో డాక్టర్ ముకుందరెడ్డి ఆధ్వర్యాన గ్రహణమొర్రి బాధితులకు ఉచిత శస్త్రచికిత్స కోసం కొత్తగూడెంలోని భవిత కేంద్రంలో మంగళవారం స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ.. ఆరు నెలల వయస్సు నుంచి 50 ఏళ్ల వయసు వరకు గ్రహణమొర్రి బాధితులకు బసవతారకం వైద్యశాల ఆధ్వర్యాన ఉచిత సేవలు అందిస్తున్నారని తెలిపారు. అనంతరం డాక్టర్ రాజేశ్ మాట్లాడగా, పలువురు బాధితులను పరీక్షించారు. కార్యక్రమంలో ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎస్.సతీశ్‌కుమార్, అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.నాగరాజశేఖర్, బసవతారకం ఆస్పత్రి వైద్యులు జోషి, రాజేశ్, ఎంఈఓ జుంకీలాల్ తదితరులు పాల్గొన్నారు.